క్లుప్తంగా

రెండు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని వగరూరు, వి.తిమ్మాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ మహ్మద్‌ఖాద్రి, ఏఓ జీరాగణేష్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులను 3 గ్రూపులుగా విభజించి ఒక్కో గ్రూపులో ఒక చార్టు ఏర్పాటు చేసి వరిసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు పలు పలు సూచనలు, సలహాలు చేశారు. ఏఈఓ నరసింహులు, రేఖా మాధురి, వీఏఏలు తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్

మంత్రాలయం రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ మార్చి 21వ తేదీ వరకు అమలులో ఉంటుందని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేయించారు. అనంతరం రాజకీయ పార్టీ నాయకులకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు. ఎవ్వరూ బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ఎదైనా ఉంటే అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఎలక్షన్ డీటీ శశిశేఖర్, వీఆర్వోలు భీమన్నగౌడ్, భీమయ్య, పవన్ తదితరులు ఉన్నారు.

రేణుక ఎల్లమ్మకు విశేష పూజలు



పూర్ణకుంభంలో నైవేద్యం తీసుకొస్తున్న భక్తులు

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల ఇలవేల్పు రేణుక ఎల్లమ్మ దేవికి విశేష పూజలు చేపట్టారు. మంగళవారం అమ్మవారి పర్వదినం కావడంతో ఆలయ అర్చకులు అయ్యన్న గౌడ, విజయ్‌కుమార్ గౌడ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమార్చన, ఆకు పూజ, ఫలపుష్పాలంకరణ, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. కోసిగితో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి మొక్కుబడిగా కుడుములు, గుగిళ్లు, కేజీ పావు ఉప్పు చెల్లించారు. మరికొందరు ఆలయ ప్రాంగణంలో పూర్ణకుంభంలో నైవేద్యం తయారు చేసి డప్పు వాయిద్యాలు, కలశాలతో ఊరేగింపు ఆలయం చెంతకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు. మరికొందరు గండదీపం, అమ్మవారికి చీర, జాకెట్ వస్త్రాలు సమర్పించుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

బాలికలు క్రీడల్లో రాణించాలి



కబడ్డీలో తలపడతున్న బాలికలు

ఆదోని అర్బన్: బాలికలు క్రీడల్లో రాణించాలని ఆదోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరా దీప్తి పిలుపునిచ్చారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన కబడ్డీ క్రీడలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. తాను స్పోర్ట్స్ నేపథ్యం నుంచి వచ్చినట్లు వివరించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయస్థాయిలో పాల్గొన్నట్లు చెప్పారు. క్రీడా శిక్షణ కార్యక్రమంలో మెలకువలు నేర్చుకొని రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ఈరన్న, ఆర్ట్స్ కళాశాల పీడీలు కంబిరెడ్డి, ఏపీపీఈటీలు, ఎస్‌ఏపీఈ ఆదోని జోన్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహులు, కార్యదర్శి నరసింహరాజు, కోశాధికారి ఆనంద్, కబడ్డీ శిక్షకులు రామన్న, హరిత, పెద్ద మహబూబ్‌బాషా, హరిబాబు, సాబీర్‌అహ్మద్, గంగాధర్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

ఆదోని అర్బన్: ఈనెల 22న జరిగే యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆదోనిలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అఖండ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తగా విచ్చేసిన పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిరక్షణకై ఈనెల 22న రాజమండ్రిలో నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న విద్యార్థుల రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున, సహాయ కార్యదర్శి అనిల్, పట్టణ నాయకులు మంజు, రసూల్, వీరేంద్ర పాల్గొన్నారు.

వీర సైనికులకు నివాళి

కోసిగి: జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న సైనికుల కాన్వాయ్‌పై జరిగిన దాడిలో వీర మరణం పొందిన 40 మంది సైనికులకు ఆత్మశాంతి కలగాలని ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకులు వీరేష్, పురుషోత్తం, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పరిజ్ఞానం పెంచుకోవాలి



ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి

కోసిగి: విద్యార్థి దశ నుంచి సైన్స్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి సూచించారు. మంగళవారం కోసిగి ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సమక్షంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటుచేసిన సైన్స్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం ఆర్డీటీ ఎనలేని సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అందులో భాగంగా రూ.35 వేలు విలువ చేసే ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జువాలజీ సబ్జెక్ట్‌లకు ఉపయోగపడే పరికరాలు అందజేసినట్లు తెలిపారు. అలాగే పాఠశాలలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగి గోపి రూ.10 వేలు, ఉపాధ్యాయులు చేయి చేయి కలిపి మరో రూ.20 వేలతో పరికరాలు కొనుగోలు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆర్డీటీ, ఉపాధ్యాయుల కృషితో పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఆర్డీటీ సెట్ ద్వారా ఎంపిక చేసి ఉచితంగా పైచదువులు అందిస్తున్నట్లు వివరించారు. ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ రంగస్వామి, మోహన్ బాబు, మధు బాబు, పీటీ ఉష, పీఎంసీ చైర్మెన్ రత్నమ్మ, వైస్ చైర్మెన్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



ఉపాధ్యాయులకు పుస్తకాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య, ఉపాధ్యాయుడు భీంరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వందగల్లు గ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పుస్తక వితరణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ ఆధ్వర్యంలో దాతలచే 211 పుస్తకాలు నవలలు, కాంపిటీషన్ బుక్స్, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు సేకరించారు. ఆ పుస్తకాలను 24 గ్రామాల్లోని పాఠశాలలకు విరాళంగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కాల్వ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, ఆర్డీటీ సిబ్బంది బసవరాజు, వీరస్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ భద్రతో రాయలసీమకు అన్యాయం

ఆదోని అర్బన్: త్వరలో జరగనున్న కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో లబ్ధి పొందాలనే లక్ష్యంతో చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టును తక్షణమే నిలుపుదల చేయాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్‌ఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌కుమార్, జిల్లా కార్యదర్శి బాలు, సహాయ కార్యదర్శి హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.22 వేల కోట్లు కేటాయించి, మొదటి విడతగా రూ.5,300 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాయలసీమ ప్రాంతానికి తీరని నష్టం జరుగుతుందని, దిగువన ఉన్న ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, రాజోలిబండ డైవర్షన్ స్కీం, కేసీ కెనాల్ తదితర పథకాలకు నీరందక ఇబ్బందులు ఏర్పడతాయని వివరించారు. డివిజన్ నాయకులు మల్లయ్య, హరి, నవీన్, వంశీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ కార్యక్రమంలో భాగంగా ఆదోని ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం పెద్దహరివాణం ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.శ్వేత, సూపర్‌వైజర్ వరలక్ష్మి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. సైకిల్ తొక్కడం వల్ల బీపీ, షుగర్, గుండె జబ్బుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మంచి వ్యాయామం అలవడుతుందని, ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కౌతాళం: సైకిల్ ఫర్ హెల్త్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకుందా అని మండల విద్యాధికారి పావని అన్నారు. మంగళవారం కౌతాళంలో వైద్య సిబ్బంది పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి పావని మాట్లాడుతూ.. పిల్లల్లో అధిక బరువు, ఒత్తిడిని ఎలా నియంత్రించుకోవాలి, రక్తపోటు, డయాబెటిస్, నిద్రలేమి వంటి సమస్యల్ని ఎలా అదుపు చేసుకోవచ్చనే విషయాలను వివరించారు. స్టాఫ్ నర్సు ప్రభావతి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేదర్‌గేరిలో అక్రమ కట్టడాలకు చెక్



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్, టీపీఓ

ఆదోని టౌన్: ఆదోని పట్టణాభివృద్ధే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తూ ముందుకు సాగుతున్నారు. మంగళవారం 36వ వార్డు మేదర్‌గేరిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం, అభివృద్ధి కోసం కుదించుకుపోయిన రోడ్ల విస్తరణకు సంబంధించి టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారులతో కొలతలు వేశారు. ఆక్రమణదారులకు కమిషనర్ వార్నింగ్ ఇచ్చారు. మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ స్థలం వదిలి పట్టా స్థలం ఉన్నంతలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో కూల్చివేస్తామని వ్యాపారులు, గృహ వినియోగదారులకు హెచ్చరించారు. అలాగే హనుమాన్ నగర్ ప్రాంతంలో జరుగుతున్న సీసీ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, లేనిపక్షంలో బిల్లులను నిలుపుదల చేస్తామన్నారు. ఎంఈ నాగభూషణ్ రెడ్డి, ఏఈలు మదన్, కృపాకర్, వార్డు సచివాలయ ఉద్యోగులు వెంట ఉన్నారు.

20 మంది మట్కా బీటర్ల అరెస్ట్



మట్కా బీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న త్రీటౌన్ సీఐ శ్రీరామ్

ఆదోని అర్బన్: స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆయా కాలనీల్లో 20 మంది మట్కా బీటర్లపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు చేసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ శ్రీరామ్ విలేకరులకు తెలిపారు. మట్కాబీటర్లు అలీహుసేన్, షేక్ చాంద్‌బాషా, చకోలీ చాంద్‌బాషా, గనీతో పాటు 16 మందిని మట్కా రాస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. వారి వద్ద నుంచి 20 మట్కా చీటీలు, 20 పెన్నులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మట్కా, గ్యాబ్లింగ్, సారాయి వంటి అసాంఘిక చర్యలపై ఎవరైనా సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి నేరస్తులను పట్టుకుని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మట్కాబీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి



సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ బోయశాంత, తదితరులు

ఆదోని టౌన్: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి దామోదరం సంజీవయ్య అని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా పెద్దపాడుకు చెందిన సంజీవయ్య దేశంలో తొలి దళిత ముఖ్యమంత్రిగా ఆంధ్ర రాష్ట్రంలో బాధ్యతలు స్వీకరించి బడుగు, బలహీనవర్గాలకు ఎనేలని సేవలు అందించాడన్నారు. కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే ఆదోనిలో సంజీవయ్య విగ్రహానికి మాలమహానాడు కర్నూలు జిల్లా అధ్యక్షులు జైభీమ్ సాయిరామ్, తలారి ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవిశెట్టి ప్రకాష్, ఎంఎండీ నూర్ తదితరులు పూలమాలలు వేసినివాళులర్పించారు.

18న వాలీబాల్ టోర్నీ

కోసిగి: మండల పరిధిలోని కొల్మాన్‌పేట గ్రామంలో మహా శివరాత్రి పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ రామాంజినేయులు, సురేష్, అనిల్, రవి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 17వ తేదీ సాయంత్రంలోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని, వివరాలకు 63023 93068 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

కౌతాళం: స్థానిక 9 వార్డు బుడగజంగాల కాలనీ, ఉప్పరవీధిలో నీటి సమస్యకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో సర్పంచ్ పాల్‌దినకర్ పరిష్కారం చూపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరును వేయించి హ్యాండ్‌బోర్ పంపు బిగించి నీటి సరఫరా కొనసాగేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడి ఎంపిక

ఆదోని అర్బన్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి ఆదేశాల మేరకు ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, జిల్లా అధ్యక్షుడు తలారి సుధాకర్ సమక్షంలో బీజేవైఎం కర్నూలు జిల్లా నూతన ఉపాధ్యక్షుడిగా అజయ్‌కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ తన శ్రమను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. బీజేవైఎం కర్నూలు ప్రధాన కార్యదర్శి కటికె ప్రసాద్, నాయకులు రఘు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు భేష్

కృష్ణగిరి: పంటల నమోదుతో రైతులకు అన్ని విధాలుగా లబ్ధి చేకూరుతుందని రైతు భరోసా కేంద్రం కమిషనరేట్ డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో పంట నమోదు చేసిన పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేలా పంటలను ఈ-క్రాప్ నమోదు చేయించి అండగా నిలుస్తోందన్నారు. గ్రామంలో దాదాపుగా 32 రికార్డులను పరిశీలించగా అన్నీ సక్రమంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆశయం నెరవేర్చే విధంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. పంట నమోదు ఆధారంగా రైతు దిగుబడులను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ రాజేష్, వీఆర్వో విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి వి.రంగారెడ్డి

పత్తికొండ రూరల్: విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని జిల్లా విద్యాధికారి వి.రంగారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం సరోజిని హుసేనమ్మ అధ్యక్షతన, బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మస్తాన్‌వలి, బాలుర గురుకులంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సువర్ణలత అధ్యక్షతన పరీక్ష పర్వ్ 4.0 కార్యక్రమంలో భాగంగా సెలబ్రేషన్ ఆఫ్ ఎగ్జామ్‌పై ఓరియంటేషన్ కమ్ సెన్సిటిజేషన్ ప్రోగ్రాం ఫర్ స్కూల్ చిల్డ్రన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వి.రంగారెడ్డి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సులభశైలిలో ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకోవడాన్ని, పరీక్షలు రాసే విధానాన్ని వివరించారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. డైట్ లెక్చరర్ షంసుద్దీన్ మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను వివరించారు. సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అరుణాచలం రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ఆలూరు: హాలహర్వి మండలం వేదావతి నది ప్రాజెక్టును పూర్తి చేసేందుకు బిల్లులు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఆయన మంగళవారం గూళ్యం గ్రామం వద్ద నిర్మిస్తున్న హైడ్రాలిక్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనుల వివరాలను సైట్ ఇంజినీర్లు రాజేష్, రంగస్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలన్నారు. వేదావతి ప్రాజెక్టు పూర్తి చేస్తే దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, వందకు పైగా గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు వెంట ఉన్నారు.

18న కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మహాశివరాత్రి పురస్కరించుకుని చుంచుఎర్రగుడి గ్రామంలో ఈ నెల 18న అంతర్రాష్ట్ర బాలుర కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి మంగళవారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20,116, రూ.15,116, రూ.10,116, రూ.5,116 అందించనున్నట్లు ప్రకటించారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు 73308 69287, 95153 93394 నంబర్లను సంప్రదించాలన్నారు.

జిల్లాస్థాయి భజన పోటీలు

చుంచుఎర్రగుడి రామలింగేశ్వర స్వామి దేవాలయంలో 18న రాత్రి 7 గంటలకు జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గెలుపొందిన వారికి వరుసగా రూ.12,016, రూ.10,016, రూ.8,016, రూ. 6,016, రూ.4,016, రూ.2,016, రూ.1,516, రూ.1,016 లను దాతల సహకారంతో అందిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్తమ హార్మోనిస్టు, తబలిస్టు, గాయకులకు రూ.516 చొప్పున ప్రోత్సాహక బహుమతి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 94924 04979, 81878 68556 నంబర్లను సంప్రదించి అదే రోజు సాయంత్రం 4 గంటల్లోగా రూ.200 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

21న బండలాగుడు పోటీలు

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఈనెల 21వ తేదీన అంతః రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసస్వామి మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి రూ.50 వేలు, తరువాతి స్థానాలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వృషభాల యజమానులు అదే రోజు ఎంట్రీ ఫీజు రూ.600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని వివరాలకు సెల్ 93818 29338, 81794 69377 నంబర్లను సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

హొళగుంద: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని హొళగుందకు చెందిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ జహీర్ మంగళవారం తెలిపారు. నిందితుడి నుంచి 6 క్వింటాళ్ల (12 బస్తాలు) పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.